క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ క్యాంప్‌లు

సారవకోట: ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆవరణలో ఆధార్ క్యాంప్‌లు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ మోహన్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సారవకోట, అలుదు, బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆవరణలో క్యాంప్‌లు నిర్వహిస్తామన్నారు. 5వ తరగతి చదువుతున్న, పూర్తయిన, 10వ తరగతి చదువుతున్న, పూర్తయిన విద్యార్థులు తమ ఆధార్ కార్డులు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఈ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జీవామృతంతో పంటకు మేలు



జీవామృతం తయారీపై శిక్షణ ఇస్తున్న ఎంటీ సూర్యనారాయణ

కొత్తూరు: ద్రవ జీవామృతాన్ని వరి పంట కాలంలో నాలుగు సార్లు వాడితే ఆరోగ్యకరమైన పంట పండుతుందని ప్రకృతి వ్యవసాయం కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్ మాస్టర్ ట్రైనీ సవర సూర్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని మాకవరం గ్రామంలో మహిళా రైతులతో 200 లీటర్ల క్వాలిటీ ద్రవజీవామృతాన్ని తయారు చేయించారు. జీవామృతం ఆరు రోజులు మురిగిన తరువాత వినియోగించాలన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలన్నారు.

తుప్పల్లో రెయిన్ గేజ్ యంత్రం!



రెయిన్ గేజ్ యంత్రం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

సారవకోట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వర్షపాత నమోదు సూచిక యంత్రం (రెయిన్ గేజ్) తుప్పల మధ్యలో ఉంది. వర్షం పడే సమయంలో ఎంత వర్ష పాతం నమోదు అవుతుంది, మండలంలో గతేడాది కంటే ఈ ఏడాది వర్ష పాతం ఎంత తక్కువ, ఎక్కువ నమోదైందని తెలుసుకునేందుకు, గాలి వేగం, గాలి వీచే దిశను తెలుసుకునేందుకు దీనిని ఏర్పాటు చేశారు. ఈ యంత్రం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగినా వాటిని తొలగించడంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని మండల వాసులు ఆరోపిస్తున్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

కొత్తూరు: రాష్ట్రంలో వచ్చే ఏడాదిలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డేపల్లి కృష్ణారావు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రం అందించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ అమలు చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారని, నేడు ఆయనే అధికారంలో ఉన్నందున ఆ హామీని నెరవేర్చాలని కోరారు. 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోవడంతో బీసీలు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.

పశువుల శాల కాదు.. అంగన్‌వాడీ భవనం



జోడూరు నూతన అంగన్‌వాడీ కేంద్రంలో పశువులు కట్టిన గ్రామస్తులు

మెళియాపుట్టి: మండలంలోని జోడూరు గ్రామంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం దాదాపు పూర్తయినా వినియోగానికి నోచుకోలేదు సరికదా.. పశువుల పాకలా మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు నిధులు రూ.16 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించారు. భవన నిర్మాణం సైతం పూర్తయి ఏడాది కాలం దాటినా వినియోగంలోకి రాలేదు. గ్రామస్తులు అందులోనే కట్టెలు నిల్వ ఉంచడం, పలు రకాల వస్తువులు, చెత్తాచెదారంతో నింపి స్టోర్ రూమ్‌లా మార్చేశారు. పశువులను సైతం అక్కడే కట్టడం వలన పేడ, మురుగుతో దుర్వాసన వస్తోంది. ప్రారంభం కాకముందే పాడుబడిన బంగ్లాలా తయారైంది. పక్కా భవనం ఉన్నా.. గ్రామంలోని అద్దె ఇంట్లో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అంగన్‌వాడీ భవనంలో కట్టెలు, ఇతర సామగ్రి ఉంచిన దృశ్యం

మురికి కూపాలు..

వ్యాధులకు నిలయాలు



యశోదనగర్‌లో దిగువ ఉన్న మురుగునీటి గుంత

- ఖాళీ స్థలాల్లో నిల్వ ఉంటున్న నీరు
- విజృంభిస్తున్న దోమలు, ఈగలు
- రోగాల బారిన ప్రజలు
- రోగులతో ఆస్పత్రుల కిటకిట

పాతపట్నం: పరిసరాల అపరిశుభ్రతతోపాటు గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఖాళీ స్థలాల్లో, వీధుల్లో మురుగునీరు చేరింది. పలుచోట్ల మురుగునీటి కాలువలు శుభ్రం చేయకపోవడంతో వీధులు చెత్తాచెదారంతో నిండిపోయాయి. పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలో 20 వేల మంది జనాభా నివస్తున్నారు. పాతపట్నంలోని పలు వీధుల్లో ఖాళీ స్థలాల్లో మురుగునీరు అధికంగా చేరి దోమలకు ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. వీటిని పంచాయతీ సిబ్బంది గుర్తించినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అసలే వ్యాధుల కాలం, ఆపై ఎక్కడికక్కడ మురుగునీటి గుంతలు, పారిశుద్ధ్య లోపంతో ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారు. ముగునీటి కాలువలతో ఖాళీ ప్రదేశాలను అనుసంధానం చేసి నీరు లేకుండా చేయాలని మండల కేంద్రం వాసులు కోరుతున్నారు. ప్రస్తుతం నరసింహనగర్, గణేష్ నగర్, ఆల్ ఆంధ్రా రోడ్డు, యశోదనగర్, కిరణ్మయి



నీలమణిదుర్గ కాలనీలో రోడ్డుపై ఉన్న మురుగునీరు

వీధి, అమ్మవారి కాలనీ, ఇందిరమ్మ కాలనీ, బాలాజీ నగర్, పట్టణ శివారులోని నూతన లే అవుట్లలో ఖాళీ స్థలాలు అధికంగా ఉన్నాయి. వీటిలో మురుగునీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఇబ్బందిగా ఉంది..



ఖాళీ స్థలాల్లో పరిసర గృహాలకు చెందిన మురుగు నీరు చేరుతుంది. లోతట్టు కావడంతో నీరు బయటకు వెళ్లడం లేదు. నీరు నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు చేరుతున్నాయి. దాదాపు అన్ని వీధుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

– గొకవలస రాము, కాపువీధి, పాతపట్నం

జ్వర బాధితులే అధికం



పాతపట్నం సీహెచ్‌సీలో ఓపీ కోసం క్యూలో ఉన్న రోగులు

పట్టణంలో జ్వర బాధితుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. అటు ప్రైవేట్, ఇటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జ్వర బాధితులు చేరుతున్నారు. పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో ఒక్క రోజులో 200 ఓపీ ఉంటే.. అందులో 50 మంది వరకు జ్వరాలతో బాధపడుతున్నవారే వస్తున్నారని, వీరిలో మండల కేంద్రానికి చెందివారే సగానికి పైగా ఉంటున్నారని వైద్యులు అంటున్నారు.

అప్రమత్తంగా ఉండాలి..



వర్షా కాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ తరచూ చేయాలి. వర్షాలు కురవడంతో మురుగునీటిలో బాక్టీరియా, వైరస్‌లు వృద్ధి చెందుతాయి. ఆస్పత్రికి అనారోగ్యంతో వస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది. ఎక్కువగా జ్వరం, విరోచనాలతో ఇబ్బంది పడేవారే వస్తున్నారు. తాగునీటిని కాచి చల్లార్చి తాగాలి.

– డాక్టర్ జి.వేణుగోపాల్, సూపరింటిండెంట్, పాతపట్నం సీహెచ్‌సీ

బూస్టర్ డోస్ వేసుకోవాలి

జలుమూరు: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని గుగ్గిలి, పాగోడు, కూర్మనాథపురం, అచ్చుతాపురం, కరవంజ, వెలుసోద తదితర గ్రామాల్లోని వరి పంట పొలాలు వర్షం నీటిలోనే ఉన్నాయి. కాలువల ద్వారా నీరు కిందకు వెళ్లకపోతే నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముంపులో ఉన్న పొలాల్లో నీటిని వీలున్నంత త్వరగా బయటకు పంపాలని మండల వ్యవసాయశాఖ అధికారి కె.రవికుమార్ సూచించారు. బూస్టర్ డోస్ ఎకరాకు 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేసుకోవాలన్నారు. వరిలో పాము పొడ తెగులు ఉధృతి అయ్యే



పాగోడు వద్ద నీట మునిగిన పంట పొలాలు

అవకాశం ఉందని, ఆకులపై మచ్చలు ఏర్పడతాయన్నారు. ఇవి ఎక్కువైతే మొక్కలు ఎండిపోతాయన్నారు. వాలిడామైసిన్ రెండు మిల్లీ లీటర్లు, హెక్సాకొనజోల్ రెండు మిల్లీ లీటర్లను తగినంత నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

అర్హతను నిరూపించుకోవాలి

హిరమండలం: దివ్యాంగులకు సంబంధించి అనర్హుల పింఛన్లను సెప్టెంబర్ నుంచి నిలిచిపోతాయని ఎంపీడీఓ కాశీప్రసాదరావు తెలిపారు. ఇటీవల డాక్టర్ల బృందం జరిపిన తనిఖీల్లో దివ్యాంగులకు సంబంధించి పూర్తి అర్హత లేనివారి పింఛన్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం మరోసారి అర్హతను నిరూపించుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్నవారి పింఛన్లు మాత్రమే నిలిపివేసిందని.. అటువంటి వారు సచివాలయాల్లో వెంటనే దరఖాస్తు చేసుకుంటే పునః పరిశీలన చేసి నిర్ధారిస్తామని తెలిపారు.

జలమయం



నరసన్నపేట: పట్టణంలోని బజారు వీధిలో రోడ్డుపై నిల్వ ఉన్న వర్షం నీరు

అల్పపీడనం ప్రభావంతో సోమవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మురుగునీటి కాలువల్లోని నీరు, చెత్తాచెదారం రోడ్లపై ప్రవహించింది. పలు గ్రామాల్లోని వరి పొలాలు నీట మునిగాయి. చెరువులు, కాలువలు వర్షం నీటితో నిండిపోయాయి. వంతెనల పైనుంచి వరదనీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. పంచాయతీ, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని మండల ప్రత్యేకాధికారులు సూచించారు. తీరప్రాంత సచివాలయ సిబ్బంది సైతం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్‌లు, రెవెన్యూ, తదితర శాఖల సిబ్బంది నదీతీర, ముంపు ప్రాంతాలను పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



పోలాకి: పల్లిపేట వద్ద వంశధార నదీతీరాన్ని పరిశీలిస్తున్న అధికారులు



పాతపట్నం: మహేంద్రతనయ కాజ్‌వేపై పారుతున్న నీటిని పరిశీలిస్తున్న మండల అధికారులు



హిరమండలం: కడపలవాడి గెడ్డ ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఈశ్వరమ్మ



ఆమదాలవలస: బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్ట్ వయోడెక్ట్ నుంచి చిమ్ముతున్న నీరు



ఆమదాలవలస రూరల్: వర్షపు నీటితో నిండిన ఆమదాలవస రైల్వే అండర్ టర్నల్



జలుమూరు: కొమనాపల్లి వంతెన వద్ద వంశధార నదిని పరిశీలిస్తున్న అధికారులు



బూర్జ: నారాయణపురం ఆనకట్ట వద్ద ప్రవహిస్తున్న నీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ పద్మావతి



కొత్తూరు: చిత్తడిగా మారిన కొత్తూరు ఆర్టీసీ కాంప్లెక్స్



నరసన్నపేట: కోమర్తి వద్ద వరి పొలాల్లో చేరిన నీరు



ఆమదాలవలస రూరల్: వర్షం నీటితో నిండిన రైల్వే స్టేషన్ ఆవరణం



కొత్తూరు: నివగాం వద్ద పీహెచ్ రోడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్ బాలకృష్ణ

మహిళలకు ఉచిత ప్రయాణం పేరుతో దగా

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి



హిరమండలం: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పేరుతో కూటమి ప్రభుత్వం దగా చేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. పాతపట్నంలోని తన కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా, ఏ బస్సులో అయినా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇవ్వలేదా అని ప్రశ్నించారు. అసలు పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు 200 కిలో మీటర్లు మాత్రమే ప్రయాణిస్తాయన్నారు. వీటితో రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ప్రయాణమని చెప్పడం బూటకం కదా అని నిలదీశారు. ఘాట్ రోడ్‌లో, ప్రముఖ దేవస్థానాలకు వెళ్లే రూట్లలో ఉచిత ప్రయాణం కల్పించకపోవడం దారుణమన్నారు. మోసాల్లో మాస్టర్ డిగ్రీ సాధించిన వ్యక్తి సీఎం చంద్రబాబు అని అన్నారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా ఉద్యోగుల విషయంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు అమానుషంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుది మోసపూరిత పాలన



వెదుళ్లవలసలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

ఆమదాలవలస రూరల్: సీఎం చంద్రబాబుది మోసపూరిత పరిపాలన అని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలస మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేసి తిరిగి కేసులు పెట్టి భయభ్రాంతులకు గురుచేస్తున్నారన్నారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి క్యూఆర్ కోడ్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బెండిగో విందరావు, పార్టీ మండల అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, పార్టీ నాయకులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉప్పు గెడ్డ వంతెనకు ముప్పు



శిథిలావస్థకు చేరుకున్న వంతెన



వంతెన కింద భాగంలో పెచ్చులూడిన దృశ్యం

పోలాకి: మండలంలోని తీర ప్రాంత గ్రామాలను కలిపే ఉప్పుగెడ్డపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. అంపలాం – రేవు అంపలాం గ్రామాల మధ్య బ్రిటీష్ కాలంలో నిర్మించిన వంతెన ఇది. కొత్తరేవు, అక్కువరం, రాజారాంపురం, కొవిరిపేట, రేవు అంపలాం గ్రామాల ప్రజలతోపాటు తీర ప్రాంతానికి చెందిన అనేక గ్రామాలను మండల కేంద్రం పోలాకికి ఈ వంతెనపై నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. వర్షా కాలం కావటంతో ఉప్పుగెడ్డలో నీటి ప్రవాహం పెరిగినా, సముద్రం పోటెక్కినా ఈ వంతెనపై నుంచి రాకపోకలు నిలిపేయాల్సిన ఆవశ్యకత ఏర్పడనుంది. అధికారులు తక్షణమే ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి సరికాదు

నరసన్నపేట: ఈ విద్యా సంవత్సరం నుంచి ఐగాట్ కర్మయోగి యాప్‌లో ఉన్న పాఠాలను వీడియో ద్వారా వీక్షించి తీరాలని ఉపాధ్యాయులపై అధికారులు ఒత్తిడి చేయడం సమంజసం కాదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లండ బాబూరావు, బమ్మిడి శ్రీరామ్మూర్తి అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొదట్లో 4 పాఠాలు వినాలని అన్నారని, ఇప్పుడు 20 పాఠాలు వినాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వ్యక్తిగతంగా సందేశాలు పంపారన్నారు. 6 పాఠాలకు మించని ఉపాధ్యాయుల పేర్లను వాట్సాప్‌లో పంపి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన చెందారు. ఇంతవరకు ఒక్క అధికారి కూడా ఐగాట్ కర్మయోగి అంటే ఏమిటి, ఎందుకు ఇందులో పాఠాలు వినాలనేది స్పష్టం చేయలేదన్నారు. యాప్‌లతోనే సమయమంతా వృథా అయితే విద్యార్థులకు పాఠాలు చెప్పే అవకాశం ఉండదన్నారు.

ఐటీడీఏ పీఓగా కొనసాగించొద్దు

సారవకోట: సీతంపేట ఐటీడీఏ పీఓగా యశ్వంత్ కుమార్‌రెడ్డిని కొనసాగించొద్దని గిరిజన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు చౌదరి లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. మన్యం జిల్లా సబ్ కలెక్టర్‌గా ఉంటూ పీఓగా (ఎఫ్ఏసీ) బాధ్యతలు చేపడుతున్నారన్నారు. మరలా ఆయననే కొనసాగించేందుకు చర్యలు జరుగుతున్నట్లు తెలుస్తోందన్నారు. కొత్తగా ఐఏఎస్ అధికారిని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.